


రోజులా తెల్లవారింది.

రోజులాగే ఐదింటికల్లా మెలకువ వచ్చింది. రోజులాగే సందేహం కలిగింది— ఈ రోజెలా గడుస్తుందోనని. నిద్రలేచేసరికి రోజూ ప్రత్యక్షము అయ్యే దృశ్యమే కనిపించింది. లక్ష్మీదేవిలా వుండే ఆమె వీధివాకిట్లో ముగ్గు వేస్తోంది.

విచ్చిన పచ్చి పసుపుకొమ్మ దేహచ్ఛాయలో, కళ కళలాడే ముఖంతో, ఎదిగీఎదగని అవయవాల ఒంపుతో— పుత్తడి బొమ్మలా వుండే ఆ పిల్ల వెంకటేశంగారి కూతురు.

వెంకటేశంగారు మా యింటి యజమాని. వృత్తిరీత్యా ప్లీడరు గుమాస్తా. ఆ పిల్ల పేరు శకుంతల!

శకుంతల తన పని పూర్తి చేసుకుని వెళ్ళిపోయింది. ఆమె కట్టుకున్న ముదురాకు పచ్చ క్రేపుసిల్కు పరికిణీ, రోజాకలర్ వాయిల్ వోణీ నా ప్రక్కగా రెపరెపలాడినట్లైంది. మనసేదో తెలియని ఉద్వేగానికి లోనైంది.

ఉత్సాహంగా లేచి వెళ్ళి జానకి ముందు వాలేను. అప్పటికప్పుడే అభ్యంగన స్నానం పూర్తి చేసి కురులార్చుకుంటూ, కాఫీ కలుపుతోంది జానకి. ప్రక్క గదిలో అమ్మ దగ్గుతో క్రుంగ దీసుకుపోతోంది.

ప్రయోగార్థం గాజు జాడీలో వుంచబడిన గులాబీ కాడ గుర్తుకొచ్చింది. గాలీ నీరువంటి జీవపదార్థాలు లేక లోలోపల వాడి, వడలిపోయే గులాబీ కాడ! ఉత్సాహం చప్పబడి, మనసు కలతచెందింది.

కాలకృత్యాల్ని యాంత్రికంగా పూర్తి చేసి బయట పడ్డాను. నా దినచర్యలో మొదటి కార్యక్రమం— అమ్మకు మందు తీసుకురావటం. నడక సాగింది. నడకతోపాటు ఆలోచనా సాగింది.

అమ్మ పరిస్థితి తలపుకొస్తే హృదయం పిండి నట్లవుతుంది. పగలూ రాత్రీ దగ్గుతో క్రుంగిపోతోందామె. భయంకరమైన ఆ వ్యాధి ఆమె నావహించటం నాన్నపోయినప్పుడే జరిగింది. శరీరంలో శక్తి వున్నంతకాలమూ వూపిరితిత్తుల గోడల్లో గోప్యంగా కాపురంచేసి, బలహీనంగా తయారవగానే ఆవహించిందా రోగం. తాను బాధపడటమే గాక, తనవారిని గూడా భీతచిత్తుల్ని చేసేస్తుందా రోగగ్రస్తులు. ఆ వ్యాధి వంశపారంపర్య హక్కును సంపాదించుకునేటంత గొప్పదని తెలియటం వల్లనే నాకీనాడు గుండెల్లో గుబులు. రామారావుగారు చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. ఆయనన్నారు, "క్షయరోగి వున్నయింట్లో,ఆ రోగితో మూడేళ్ళగా కలిసి జీవించినావాలు—దాని ప్రభావం ఆరోగ్యవంతుని మీదకూడా వుంటుంది. పైగా, ఆ రోగాన్నుంచీ కోలుకుని ఐదేళ్ళ పరిపూర్ణారోగ్యంతో తిరిగిన వ్యక్తికైనా ఆ వ్యాధి తిరగబెట్టే అవకాశం వుంది."

డాక్టర్ చెప్పిన మాటలు నెమరు వేసుకునే సరికి గుండెల్లో దిగులూ, భయమూ గూడుకట్టుకున్నాయి. కలిసి జీవించినంత మాత్రాన ఆరోగ్యవంతుని మీదనే దాని ప్రభావం వుంటుందనేది నిజమైనప్పుడు, నా వంటి సగటు ఆరోగ్యవంతుని విషయంలో అది మరీ ప్రమాదకరమైన పరిణామమే! ఈ మధ్య బరువు చూసుకుంటే నేను పది హేను శాతం తక్కువ తూకపు వాడినని తేలింది. ఇలాంటి వారి మీద ఆ జబ్బు ప్రభావం తీవ్రంగా

వుంటుందన్నాడు, మధుసూదనరావు.'

త్వరలోనే నేనూ రోగ గ్రస్తుణ్ణవుతా నేమోనని పించింది. అవును. నాకసలే మూడుమూన్నాళ్లకూ జలుబూ, పడిసెమూ పడుతూవుంటాయి. అలాంటి ఏ శుభముహూర్తంలోనో నాకా రాజయోగం ప్రారంభం కావటానికి అవకాశం వుంది.

ప్రయోగార్థం గాజుజాడీలో వుంచబడిన గులాబీ కాడ గుర్తు కొచ్చింది.

దయానిధి అంటూ వుంటాడు— రోగం రాజయోగమని!

సన్నటి ఈల, ఈలతోపాటు స్కూటర్ ఆగిన శబ్దమూ, ఈ రెంటితోపాటు నా భుజంమీద పడిన దెబ్బతో ఆలోచన తెగింది. తెగిన ఆలోచనతో పాటు కాళ్ళూ ఆగేయి. ప్రక్కకు చూసేసరికి దయానిధి!

"ఏమూర్తీ, మాతృశ్రీ సేవా కార్యక్రమమా?" నవ్వుతూ పలకరించేడు దయానిధి, ప్రక్కకు వంగిపోతున్న స్కూటర్ని కాలితోతో నిలుపుతూ.

సమాధానం 'అవు'నని అతనికి తెలుసు కనుక నేనేం చెప్పలేదు. దయానిధి దృష్టి హఠాత్తుగా ప్రక్కకు మరలింది మెరుపు తీగెవంటి హోయువతి స్కైకిల్ త్రొక్కుకుంటూ వెళ్తోంది.

వాదృష్టి దయానిధిమీద లగ్నమైంది. పండిన అరిటాకు పసిమిరంగులో, ముట్టుకుంటే కంది పోతాడా అన్నంత సుకుమారంగా, అందానికి తగిన టెరికాటన్ పాంటూ, టెర్లిన్ షర్టూ, రిమ్‌లెస్ కళ్ళద్దాలలో మెరిసి పోతున్నాడు దయానిధి. అతని షర్టు జేబులో వందరూపాయల కాగితాలకు ముందు క్రొత్త రూపాయినోట్లకట్ట మిడిసి పడుతోంది.

దయానిధి చూపులు మరల్చాడు, "నా ముఖములో ఏముందోయ్, అలా చూస్తున్నావ్?" అని నవ్వుతూ వెనక్కి తిరిగి "అటుచూడు" అన్నట్లు కనుసైగ చేసేడు. నేనొక శుష్కహాసంతో సమాధానమిచ్చేను. దయానిధి వాచీ చూసుకుంటూ అన్నాడు, "ఎందుకీ బహిరంగ సభ! కమాన్ అలా వెళ్లి హోటల్లో కూర్చుందాం."

నేను కొంచెం బెరుగ్గా, మొహమాటంగా, "ఇప్పుడే అయింది కాఫీ. నువ్వు పద" అన్నాను.

దయానిధి వావీపు చరిచేడు, మన్నితంగా. "ఏమిటోయ్ మూర్తీ. రోజురోజుకీ నువు మరీ సాధూసమాజ్ సభ్యుడివవుతున్నావ్! ఒక మాట చెప్తా వినుభాయ్, నవ్వుతూ త్రుళ్లుతూ తిరగటం నేర్చుకోవోయ్. దుర్లభమైన ఈ మానవ జన్మని ఇలా బాధల్లో వ్యర్థంచేయటం— హో విధంగానేరం. ఈడురోమంటూ గడ్డం పెంచుకుని, జుట్టు పీక్కుని. ..... ..... ఏమిటిది?. ఏ... నో. ..... నో... నోగుడ్" అంటూ చిత్రంగా చేతులు త్రిప్పేడు.

"అంతటి అదృష్టవంతుణ్ణి కాదు"— లోలోపల గొణుక్కున్నాను. దయానిధి మరోమారు తొందర చేయటంతో స్కూటర్‌మీద కూర్చున్నాను.

— హోటల్లో జీవితాన్ని ఆనందంగా గడపవలసిన ఆవశ్యకతను గురించి హో చిన్న ఉపన్యాస మిచ్చేడు, దయానిధి. మౌనంగా విన్నాను. కాఫీలయిన తర్వాత 'క్లీకాశిల్స్' సిగరెట్ అందించేడు. వద్దన్నాను. 'కాల్చి చూడు, దానిమజా' అని నోట్లో వుంచేడు. ఆ తర్వాత క్షణంకూడా నిలబడకుండా, "వస్తా మూర్తీ. పదిగంటల బండికి విజయనగరం పోవాలి. అక్కణ్ణుంచీ ఒరిస్సా చుట్టిరావాలి" అంటూ వెళ్లిపోయేడు.

నేను నడక సాగించేను. నోట్లో వున్న సిగరెట్ కాలిపోతోంది. దానిలోవున్న 'మజా' ఏమిటో అర్థం కాకపోగా, పొగ నోట్లోకిపోయి ఉక్కిరిబిక్కిరైనాను, గుండెల్లో నొప్పి అనిపించింది. అమ్మ గుర్తుకొచ్చింది. ఈ మాత్రపు దగ్గుకే ఇంత బాధగా వుంది. ఆమె— అమ్మ! అంతటి భయంకరమైన దగ్గు, ఆయాసాన్ని ఎలా సహించగలుగుతోందో ననిపించింది.

ప్రయోగార్థం గాజు జాడీలో వుంచబడిన గులాబీకాడ కళ్లకు కట్టింది.

అప్రయత్నంగా ముఖం తుడుచుకునే సరికి కళ్ళల్లో తిరిగిన నీరు చేతికి తగిలింది. గడ్డమూ గరగర లాడింది. దయానిధి మాటలు గుర్తుకొచ్చినై. ఆర్థిక వ్యవస్థ అనే పగ్గపు ఉచ్చు ఎరగని మనిషి. దయానిధికి హో ఉద్యోగంలేదు, వ్యాపకం లేదు, వ్యాసంగంలేదు. కాని, అతనెప్పుడూ 'ఖుషీ'గా వుంటాడు. ఎక్కడెక్కడికో 'టూర్సు' చేస్తూ వుంటాడు. మిత్రు లెవరన్నా కనిపిస్తే ఆప్యాయంగా పలకరిస్తాడు, బలవంతంచేసి కాఫీకో, డ్రింక్‌కో తీసుకుపోతాడు. క్షణంలో తనకు అత్యవసరమైన పని వున్నదంటూ వెళ్లిపోతాడు. ఎంత సుఖప్రదమైన జీవితం! బ్రతుకును గురించి ఏ ఆలోచనా— భయమూ, దిగులూ— విచారమూ లేని అదృష్టవంతుడు.

అలవాటు పడిన కాళ్లు హాస్పటల్‌లోకి తీసినై. డాక్టర్ రామారావుగారు విషాదంగా కుడి చేత్తో గడ్డం నిమురుకుంటూ, వాకిట్లో అస్థిమితంగా తిరుగుతున్నారు. ఆయనకు కొద్ది దూరములో ఇద్దరు ఆడవాళ్లు, ఒక ముసలివ్యక్తి కూర్చుని ఏడుస్తున్నారు. ఆతృతగా లోపలికి వెళ్లి ఆ వైపు చూసేను. వాళ్ల ముగ్గురికీ మధ్య మృతదేహం!

హృదయం పిండినట్లైంది. మెదడు మొద్దుబారింది. కళ్ళు ప్రక్క బెంచీమీద కూర్చున్న కాంతారావుగారిమీద నిలిచేయి కాబోలు, ఆయన చెప్పారు— "థొరాకోప్లాస్టీ ఆపరేషన్ చేశారు. పాపం.................."

శరీరం జలదరించింది. కాళ్లూ చేతులూ నీరు కారి, తలమీద వెయ్యి మెగాటన్‌ల బరువుంచి నట్లనిపించింది. స్తబ్ధుగా కూలబడిపోయేను.

అమ్మ..... నేను..... జానకి..... నాసంతానం, గాజు జాడీలో వుంచబడిన గులాబీ కాడ.......... ఏమిటేమిటో దృశ్యాలు మనోయవనిక మీద కదలి పోతున్నాయి.

"డాక్టర్‌గారు పిలుస్తున్నా"రన్న కాంపౌండర్ పిలుపుతో స్పృహలో కొచ్చేను.

—మందు తీసుకుని బయటికి రాగానే కాంతారావుగారు పలకరించారు, "మీ అమ్మగారి కెలా వుంది." అంటూ.

"అలాగే వుంది"— ఇలా అనటం ఒక అలవాటుగా మారింది నాకు. కాంతారావుగారు సానుభూతి సూచకంగా, "ఏమిటో పాపం, ఆవిడకీ వయస్సులో ఈ యమబాధ" అన్నారు.

వాపనిపించింది— ఏ వయస్సయితేనేం? యౌవనంలో అడుగిడుతున్న వారినీ, జీవన సంధ్యలో ప్రవేశించిన వారినీ— సమంగానే ప్రేమించే వ్యాధి అది!

కాంతారావుగారు హైస్కూల్లో టీచరు. ఆయనతో నా పరిచయం ఈ ఆసుపత్రిలోనే. ఆయన భార్యకూడా క్షయరోగి. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత ఆమె రోగగ్రస్తురాలైందట. ఇప్పటికి రెండేళ్లనుంచీ వైద్యం కొనసాగుతూనే వుంది. ఆయన ఒకప్పుడు చెప్పిన మాట గుర్తు కొచ్చింది. "అన్ని జబ్బులూ ఒక యెత్తు, ఇదొక ఎత్తూనండి మాస్టారూ. భార్యాభర్తల సంబంధాన్ని కూడా మరచిపోవాలంటే ఎంత దురవస్థ చూడండి" అని వాపోయారాయన. వారి దుస్థితికి జాలివేసింది. రెండేళ్లనుంచీ భార్య సంపర్కం లేకుండా ఆమెకు సేవ చేస్తున్న ఆయన ఓర్పుకీ, త్యాగబుద్ధికీ నా కాశ్చర్యం వేసింది. ఆ అనుబంధంలోని ప్రత్యేకత అదే కాబోలు! జానకి పదిరోజులు పుట్టింటికి వెళ్తే నానాబాధపడిన నా స్థితి తలపుకొచ్చి, కాంతారావుగారిపట్ల జాలి, సానుభూతి యినుమడించాయి. మూగగా ఆయనవైపు చూస్తూ 'వస్తా'నని సెలవు తీసుకున్నాను.

జానకితో మాట్లాడుతున్న శకుంతల— నేను రావటం గమనించి, వెంటనే వాళ్ళింట్లోకి వెళ్లి పోయింది.

టైము తొమ్మిది దాటింది. స్నానం ముగించి భోజనానికి కూర్చున్నాను. అన్నం వడ్డిస్తూ చెప్పుకుపోతోంది జానకి, "పిచ్చి పిల్ల. ఇందాకట్నుంచీ ఒకటే క్షోభ!"

"ఎవరు?" అన్నట్లు ఆమె ముఖంలోకిచూసేను.

"అదేనండీ. వాళ్ల శకుంతల. నిన్న పెళ్లిచూపులు జరిపితిరా. అయినా ఇలాంటి వ్యవహారాల్లో మనిషి తెందుకంత జోక్యం. ఆ పిల్లకి సంబంధం యిష్టం లేదుట!"

నేను నివ్వెరపోయేను. "ఎందుకని?"

"ఎందుకనేమిటి? ఎదుసొచ్చిన పిల్ల. ఎన్నెన్నో వూహలు, భావాలూ వుంటాయి. ఆ పెళ్లికొడుకు స్కూలు మాస్టర్టగదా. బడిపంతులు కాని వాణ్ణి ఎవర్నయినా చేసుకుంటుందిటగానీ, మాస్టర్ని చేసు కోవటం మాత్రం యిష్టంలేదుట. ఈ సంబంధం మీరే తెచ్చారని మీమీద కోపంగా వుందికూడా!"

"ఆ సంగతి వాళ్లనాన్నకు చెప్పమను" అన్నాను కొంచెం విసుగుదలను ప్రకటిస్తూ.

"ఆ సలహా సరేలెండి" అని మజ్జిగ పోసేసింది జానకి. పుణ్యానికిపోతే పాపం కలిగినట్లుంది వ్యవహారం. నాకు వెంకటేశంగారి అభ్యర్థన గుర్తుకొచ్చింది. 'మీ ఎరుకలో ఎవరన్నా కుర్రాడుంటే చెప్ప' మన్నాడాయన తెలిసిన వాడుగదా అని నేను ప్రసాద్‌ని తీసికొచ్చేను. ఈ సంబంధం తెచ్చినందుకు నన్ను ఎంతగానో మెచ్చుకుంటూ తన కృతజ్ఞతని తెలియజేసేరు, వెంకటేశంగారు. కాని శకుంతల?"

నాకూ ఆపిల్లపట్ల జాలి కలిగింది. భవిష్యత్తు సుఖప్రదమవాలని ఏ పిల్ల కోరుకోదని పించింది. ఈ వ్యవహారం ఎలా పరిణమిస్తుందోనన్న సందేహం, నన్ను గురించి వారూ వీరూ ఎలా భావిస్తారోనన్న దిగులూ బయల్దేరినై.

ఆఫీసుకు బయల్దేరాను.

# చక్రనేమిక్రమం

బస్సు సాగిపోతోంది. నా ఎదురుసీట్లో కూర్చున్న యువతి అప్పటికప్పుడే నాలుగైదుసార్లు కోపంగా, కళ్ళెర్రచేసి చూడటం జరిగింది. నాకు విషయమేమిటో అర్థంకావటంలేదు. కొన్ని నిముషాలక్రితం నుంచీ ఆమె అలా చూస్తూ వుండటం, నేను చూపులు మరల్చుకుంటూ వుండటం జరుగుతోంది.

నేనామెను పరీక్షగా చూసేనీసారి. కుమ్మపాలు త్రాగి, జొన్నన్నంతిని, పచ్చని చేలల్లో తిరుగుతూ పెరిగిన పిల్లలా వుందామె. పల్లెపట్టుల్లోని ఆరోగ్యాన్నంతా తన స్వంతం చేసుకుని నిప్పుగా, అందంగా కనపడుతోంది.

ఆమె మళ్ళీ నావైపు చూసింది. ఉండి వుండి ఆమె అలా నావైపు చూస్తూవుండటంతో నా మనసులో బెరుకుదన మేర్పడింది.

బస్సు ఏదో స్టాపులో ఆగింది. ఆమె నావైపు చూసింది! మళ్ళీ అదే చూపు— పసిపిల్లవాడిపై అగ్ని గ్రుడ్లెర్రచేసినట్లు! నేను ఈసారి కొంచెం ధైర్యాన్ని కూడగట్టుకుని ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసేను. ఆమె కూడా నన్ను తీక్షణంగా చూస్తూ, తన చీర కుచ్చెళ్ళను సరిచేసుకుని, పాదాలవైపోకసారి చూసుకుని— కాళ్ళు వెనక్కు పెట్టుకుంది. నాకామె బాధ అవగతమైంది. తన కాళ్లకు నాకాళ్ళు తగుల్తున్నాయనే చిరాకు, అసహ్యం, కోపం, రోషం— అన్నీ ఆమెకు కలుగుతున్నాయని గ్రహించేను. అయితే నేనంత అజాగ్రత్తగాగాని, దుర్బుద్ధితోగాని ప్రవర్తించకపోవటంతో ఆశ్చర్యపోయి ఆలోచించసాగేను. క్షణక్షణాన ఏదో రకమైన 'భీతి' నన్ను పీడిస్తున్నదేమీ అనే బాధ కలిగింది.

బస్సు కదిలింది. నేను చూసీచూడనట్లు ఆమె కాళ్లవైపు చూడసాగేను. రెండు క్షణాల్లోనే నేరస్థుడు దొరికేడు. నా ప్రక్కన కూర్చున్న భావి భారత పౌరుడొకడు ఈ లీలా విలాసానికి కారకుడు! అతను నిద్రమత్తు బహునేర్పుగా నటిస్తున్నాడు. ఆమె కి వాస్తవాన్ని తెలియజేయాలని పొడిగాడిగ్గి ఆ యువకుని కాళ్ళవైపు చూపులు మరల్చాను. కాని, నా గ్రహచారం బాగాలేదు. అతను తనకాళ్లను వెనక్కు తీసుకోవటం, ఆ పిల్ల అపరకాళికలా లేచి నన్ను నానా దుర్భాషలాడటం— క్షణంలో జరిగినై.

నేను కళవరపడి ఏదో చెప్పబోయేను. అయితే బస్సులో తోటి ప్రయాణీకులూ ఆ యువతీ నాకా అవకాశ మివ్వలేదు. నీతిని గురించి, మంచి తనాన్ని గురించి, సంఘమర్యాద—సభ్యతల్ని గురించి ఉపన్యాసాలు మొదలైనాయి. నేను సిగ్గుతో అసహాయతతో తలవంచుకోవలసి వచ్చింది. నా ప్రక్కనున్న 'జెంటిల్‌మన్' నాకు 'మేనర్సు' నేర్చుకోమని హితవు చెప్పింది. ఆవేశమూ రోషమూ వెనక్కుపోయి ఏడుపు బయటకొచ్చింది. 'బ్రూట్, ఇడియట్' వంటి పదజాలం 'గుండె గొంతుక' లోనే కొట్టుకులాడింది.

నేను దిగవలసిన స్టాప్‌లో బస్ ఆగింది. బస్‌లో నా గురించిన చర్చ కొనసాగుతూనే వుంది. తల వంచుకుని, ఉమ్మి మ్రింగుకుంటూ క్రిందికి దిగేను.

కలతచెందిన మనస్సుతో ఆఫీసుకొచ్చి నాసీట్లో కూర్చున్నాను. నా వాలకాన్ని గమనించేడు కాబోలు "ఏమిటోయ్ మూర్తీ అలావున్నావ్?" అంటూ దగ్గరగా వచ్చేడు మధుసూదనం.

ఆఫీసు మిత్రుల్లో నాకు ఆప్తుడు, మధుసూదనం!

"ఏంవీ లేదోయ్" అని ముభావంగా పనిలో మునిగి పోవాలని ప్రయత్నించేను గానీ, మధుసూదనం వదల్లేదు. మా అమ్మ ఆరోగ్యాన్ని గురించి గుచ్చి గుచ్చి అడిగేడు.

"అలాగే వుంది, క్రొత్తగా వచ్చిన జబ్బేం లేదు" విసుగ్గా అన్నాను.

"ఒక్క సలహా చెప్తా వింటావా మూర్తీ?"

"ఏమిటి?"

"నామాటవిని ఆవిడ్ని శానిటోరియంలో చేర్పించు. ఆ రామారావుగారెంత స్పెషలిస్టే అయినా శానిటోరియం చికిత్సకీ ఈ మందులు వాడటానికీ చాలా తేడావుంది."

నాకు ప్రొద్దుటి సంఘటన గుర్తుకొచ్చింది. రామారావుగారి వైద్యం మీద నమ్మకం వుంచాలా అక్కర్లేదా అనే మథన బయల్దేరింది. పోనీ, మధుసూదనం సలహా వింటే?— దానికి అమ్మ సుతరామూ ఇష్టపడదు. లోగా ఒకసారి ఎవరో ఈ ప్రసక్తి తెస్తే, 'వాడికీ, వాడి పెళ్ళానికీ అంతగా నా పీడ గిట్టకపోతే అక్కడే పడేయమను' అని ఆవిడ బాధగా అనటం నేనే విన్నాను.

తల్లీ కొడుకుల మధ్య కూడా నిష్కర్షగా మాటలాడుకోవటానికి వీలులేని కొన్ని కొన్ని అతిసున్నితమైన సమస్యలు మధ్యతరగతి జీవులకు మాత్రమే ఎదురవుతాయేమోనని పిస్తుంది. జానకి అహరహమూ అమ్మదగ్గరుండీ ఆవిడ అవసరాలు చూస్తూ వుంటోంది. ఆ భయంకర వ్యాధినిగురించీ, నా భవిష్యత్తును గురించీ నాకెంత భీతిగావుందో— జానకిని గురించి అంతటి బాధ కలుగుతోంది. కాని, నోరు విప్పి వాళ్ళల్లో ఎవరికీ ఏమీ చెప్పలేని మూగ వేదన నాది. అథవా మొండి ధైర్యాన్ని కూడగట్టుకుని చెప్పేనో— అపార్థాలూ, రాద్ధాంతాలూ! ఇలాంటి పరిస్థితుల్లో మరోకమారు అమ్మతో శానిటోరియం విషయం ప్రస్తావించటం కొడుకుగా నాకు ధర్మంకాదు.

ఇన్ని నిముషాలపాటు నేనేమీ సమాధానం చెప్పకుండా ఆలోచనలో పడటంతో తన సీట్లోకి వెళ్ళిపోయేడు, మధుసూదనం.

— చేసిన పనేమీ లేకపోయినా పన్నెండయింది. ఉన్నట్టుండి ఆఫీసులో కలకలం బయల్దేరింది. విషయమేమిటా అని విచారించేసరికి గుండెల్లో గాలం పడింది. ఆ వార్త అలాంటిది!

ఆఫీసులో వున్న వందమంది ఉద్యోగుల్లోను ఇరవైమందిని రిట్రెంచ్ చేయడానికి కంపెనీ డైరెక్టర్లబోర్డు తీర్మానించిందట! ఉద్యోగులంతా రకరకాల వ్యాఖ్యానాలు మొదలెట్టారు. కొందరు పాతవాళ్ళని, రిటైరవబోయేవారినీ తొలగిస్తారంటే, కాదు— జూనియర్సుకే తిలోదకాలిస్తారట అని కొందరు జోస్యం చెప్పసాగేరు. ఆ జూనియర్స్‌లో నేనూ ఒకణ్ణి! మానసికంగా ఒకరకమైన అస్థిమితానికి లోనైనాను.

"మిమ్మల్ని ఛైర్మన్‌గారు పిలుస్తున్నా"రంటూ వచ్చేడు బిసాను. సహోద్యోగులంతా "నువ్వే తొలిబలి నేమో పోయిరమ్మ"న్నారు.

గుండెలు చిక్కబట్టుకొని లోపలికి వెళ్ళాను.

* * *

లక్ష్మీపతిగారు కిటికీలోనుంచి ఆకాశం వైపు దృష్టి సారించి వున్నారు. ఆయన చేతిలోని సిగరెట్టు నామేధస్సులోని ఆలోచనల్లా రగిలి, పొగ విడుస్తోంది. పైనున్న ఫేన్ గాలికి టేబుల్‌మీద కాగితాలు భీతివల్ల రెపరెపలాడుతున్న నా గుండెల్లా కొట్టుకుంటున్నాయి.

క్షణంసేపు—ఆయన దృష్టి మరల్చటానికి ఏం చేయటమా అని ఆలోచించేను. మరో క్షణకాలం ఆయన ధరించిన ట్వీడ్ సూట్ వంక చూడటంలో గడచింది.

"పిలిచేరట!"—కంఠస్వరం పణికి, ఈసూటు అక్కడున్న ఏవస్తువునుద్దేశించో అన్నట్లని పించింది— నాకే!

లక్ష్మీపతిగారు ప్రక్కకు తిరిగి నావైపు అదోలా చూసేరు. వారి వదనం విషణ్ణమై వుంది. కాని, నాపరిస్థితి మాత్రం —తుపాకి గుండును తప్పించుకోజూసే సైనికుడి స్థితిలా వుంది. కొలి గ్రౌండ్‌లో వార్త వినువుకోబోయే ముందున్న ఆందోళన వంటిది కలిగింది. మానసికంగా క్రుంగిపోయిన నేను దైహికంగా కూడా నీరసపడితూలి క్రిందపడబోయాను. కాని, అంతలోనే తమాయించుకున్నాను.

లిప్తకాలంలో నేనింతటి సంఘర్షణకు లోనౌవటం లక్ష్మీపతిగారి వంటి జ్ఞాని కనిపెడట్టకుండా వుంటాడా? ఆయన నాముఖంలోకిచూస్తూ చిత్రంగా సన్నగా నవ్వేరు.

"మీతో ప్రత్యేకమైన పని వుంది మూర్తిగారూ. కష్టమనుకోకుంటే మాయింటివైపోకసారి రాగలరా?"

ఊపిరి తిత్తుల్లో బిగబట్టిన గాలి అంతా బయటికి వొచ్చి కొచ్చింది. విజయ పతాకం ప్రతిష్ఠించిన సిరస్సైనికుణ్ణయాను— క్షణంసేపు. ఆక్షణం చివరి దశలో మళ్లీ కోటి సందేహాలుద్భవించినై. "అలాగే సార్" అని బయట పడ్డాను.

విసిరి వేయబడిన ఖాళీ బెల్లపు బుట్ట చుట్టూ మూగే ఈగల్లా నాచుట్టూ మూగేరు ఉద్యోగులు. అందరి ప్రశ్నలకు సమాధానంచెప్పే సరికీతల ప్రాణం తోకకు వచ్చింది. సీట్లో కూర్చునిరెండు గ్లాసులు మంచి నీళ్ళు త్రాగేను. మధుసూదనం తయారయ్యాడు. "ఏం గురూ, చివరినుంచి తొమ్మిదో వాడి నను కుంటున్నాను. నువ్వు అంతేగా" అంటూ.

జూనియర్సు లిస్టులో తొమ్మిదోవాణ్ణి నేను! నిరుద్యోగ రాకాసి వికటాట్టహాసం చేస్తూ ఎదుట నిలిచింది. 'అవు'నని ముభావంగా అన్నాను. కొంప మునిగి పోయి ఏడుస్తున్న వార్ని సముదాయిస్తున్నట్లు ఏవేవో మాట్లాడ సాగాడు మధుసూదనం. ఆఫీసులో అందరి ముఖాలవైపూ ఒక్కసారి తేరిపార జూసేను. ఏ సీట్లోనూ ఎవ్వరూ పనిచేయటం

లేదు.—ఒక్క కమల తప్ప. నాకు అమితమైన ఆశ్చర్యం కలిగింది. కారణం మా ఆఫీసంతటికీ "జూనియర్ మోస్ట్" కమలే! ఆమె ఉద్యోగంలో చేరి ఏడాదయిందేమో! ఆమె అంత నిర్లిప్తంగా, నిర్వికారంగా తనపనినితానెలా చేసుకు పోగలుగుతున్నదో అర్థం కాలేదు. బహుశా ఉబుసుపోకకు, 'హాబీ'గా ఈ వుద్యోగంలో చేరిందేమో నని పించింది.

హఠాత్తుగా ప్రైడ్ రాజా గుర్తుకొచ్చేడు. అతనంటూవుండేవాడు, "భారత దేశంలో అవసరమై ఉద్యోగాలు చేస్తున్న వారికంటే ఆ అవసరం లేక కాలక్షేపానికీ, సోదరు ఖర్చుల కోసం ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య హెచ్చు. నిరుద్యోగ సమస్య తీరాలంటే ముందు వాళ్ళందర్నీ ఉద్యోగాలనుంచి తొలగించి వేయాలి. అంతే గాక, భార్యా భర్తల్లో ఒకరు ఉద్యోగి అయివుంటే రెండవ వారికి ఉద్యోగం లభించనీయ కూడదు." అని. అతని వాదనలోని నిజానిజాలెలావున్నా, కమల ఆకోవకు చెందినయువతేమోనని పించింది.

మధుసూదనం ఎప్పుడు వెళ్ళిపోయాడోగాని, అక్కడ లేడు.

ఇరవైమందికి శ్రీముఖా లిస్తారంటే నాకు కలగబోయే దుస్థితి తలపు కొచ్చింది. 'రెక్కలిచ్చాను, అమ్మకు బ్రతకమని ఈ లోకంనుంచే సెలవు తీసుకున్న నాన్న కళ్ళకు కట్టేడు. తనజీవితాన్ని మూడు పూవులు ఆరు కాయలుగాగడిపి, ఉన్న ఏకైక పుత్రుడికి రెక్కలు మాత్రం మిగిల్చిన తండ్రి! ఉన్న పళంగా ఉద్యోగం వూడితే నాకు కలగబోయే దురవస్థకు —ఎప్పుడోచిన్నప్పుడే నాంది వాచకం పలికిన జనకుడు!

ఇక అమ్మ! కొట్టినా తిట్టినా కొడుకే అనుకునే మంచం దిగలేని అమ్మ!

అనుభవించే వయస్సులో ఏ అచ్చటా ముచ్చటా తీర్చ లేని భర్తకు అనురాగం అందించటంలో అరితేరిన జాణకి! ఆమెకూ 'హా' అనుకునేవాళ్ళెవరూ లేరు!

ఇవ్వవలసిన పెంజీతం ఇచ్చి, ఆఫీసువారు రేపే ఇంటికి పొమ్మంటే?—

అప్పుడు దానితో పదిహేను రోజులు ఇదే బ్రతుకు బ్రతక వచ్చు—అప్పులు తీర్చటం అనే సమస్యను మరచి పోతే!

అనుర్నాడు—వెంకటేశం గారి ఇంటితో ఋణం తీరి పోతుంది. ఎక్కడ నివసించటం?—చెట్టు గుడ్డలతో చెట్టు క్రిందనా? 'విపులాచ పృథ్వీ' అని నేర్చుకున్నాను గనుక, పేవ్‌మెంట్లమీదే గడువ గలనని వూరడించు కుంటే?— ఒకపూట కూటికి కాక పోయినా, రెండురోజులకు ఒకపూటకైనా తాపత్రయం తప్పదుగదా? ఎలా లభ్యమౌతుంది? పోనీ, ఏ ఉద్యోగమో దొరక్క పోతుందా అనుకుంటే దొరుకుతుందనే నమ్మకమేమిటి? విదేశాలకుపోయి వచ్చిన 'డాక్టర్లు' ఢిల్లీ బజార్లు సర్వేచేస్తుంటే, ఫస్ట్‌క్లాస్ ఎమ్మేలు ఎందరో పట్టా పుచ్చుకుని ఎక్కే గడపా దిగే గడపాగా తిరుగు పడుతుంటే నావంటి ఫస్ట్‌క్లాస్ ఓల్డ్ ఇంటర్మీడియట్‌కెక్కడ దొరుకుతుంది ఉద్యోగం? దొరకని నాడు నాకు కర్తవ్యం? కట్టుకున్న పెళ్ళాన్ని కన్నతల్లినీ వదిలి....

నాకళ్ళయెదుట లీలగా కదలాడసాగిందొక దృశ్యం

అప్పటికి నాకు పదేళ్ళుంటాయేమో. అమ్మ మశూచి వ్యాధికి గురయి తీసుకుంటున్న రోజులు—మండువేసవిలో అరికాళ్ళ బొబ్బ లెక్కుతుండగా పూటకి పది సార్లు బజారుకు తిరగటం అప్పట్లో నావిధి.

ఆవేళ—

బజార్లో ఏదో కొనుక్కుని మేడల నీడల్రకిందగా గెంతుకుంటూ ఇంటికి వస్తున్నాను. బడ్డీ కొట్లముందున్న సోడా తొట్టెల్లోని నీటికోసం కాకులే ఎగబడుతున్న గ్రీష్మం! రామాలయం ముందుకొచ్చే సరికి నానడక ఆగిపోయింది. అక్కడ పది పదిహేనుమంది గుమి గూడి ఏదో మాట్లాడు కుంటున్నారు. రామాలయం అరుగు మీద ఓ యువకుడు పడుకునున్నాడు. ఓ పావుగంట నిలబడ్డాను. అక్కడవాళ్ళ మాటల్లో తెలుసుకున్న ఓ కటిక నిజాన్ని నాకళ్ళూ మెదడూ నమ్మలేక పోయాయి. అతను బియ్యే ప్యాసయిన నిరుద్యోగిట. వూరు రాజంపేట. ఉద్యోగం కోసం వూరూరూ తిరుగుతూ మావాడ కొచ్చాడు. అక్కడి కొచ్చేసరికి ప్రాణం కళ్ళల్లో కొచ్చింది. అతను వస్తూనే ప్రయాణం సాగిస్తుంటే, అతనిలోని 'హంస'తన ప్రయాణానికి తాను సిద్ధమౌతూవుండి వుంటుంది. మావూరి వాతావరణం నచ్చక 'హంస' లేచి పోయి వుంటుంది. అతను నిర్జీవి కావటం అందరూ చూసేరుగానీ, ఈవార్తవిని నేను నిర్జీవిని కావటం నాకు మాత్రమే తెలుసు. పెరిగిన గడ్డం, సంస్కారం లేని జుట్టు, ఎండిపోయిన చెక్కిళ్ళు, లోతుకు పీక్కుపోయిన కళ్ళు, మాసిన దుస్తులు, అరిగిన చెప్పులు, కుడిచేతిలో 'కవిలకట్ట' వంటి కాగితాలు (టెస్టిమోనియల్స్ కాబోలు!)—

ఆయువకుని ఆకారం కనుమరుగైంది.

కుర్చీలో జారగిల పడిపోయాను. ముఖాన్న పట్టిన చెమటను తుడుచుకొని చుట్టూ చూసేను.

ఫాన్లన్నీ తిరుగుతున్నై. టేబుల్స్‌మీది కాగితాలన్నీ రెపరెపలాడుతున్నాయి. లంచ్ టైమయి పోయింది కాబోలు అప్పటి కప్పుడే అందరూ వెళ్ళి పోయారు. కమల తన సీట్లోనే కూర్చొని ఫలహారం చేస్తుంది. హాలుకు మూలగా ఉన్న బెంచి మీద నిద్రకుపక్రమించేరు సారంగపాణిగారు. ఆయనకు అదొక అలవాటు.

ఈవాతావరణం ఈపరిచయాలు ఈ పంథవాలూ ఇంతటితో సరి కాబోలనిపించే సరికి రామాలయంలో మరణించిన యువకుడు గుర్తుకొచ్చేడు. ఒళ్ళు జలదరించింది. సీట్లోనుంచి లేచేను. ఇంటికి వెళ్ళాలనిపించలేదు. కమల సీటు ప్రక్కనున్న బల్లపై పేపరు కనపడింది. ఆ వైపు నడిచేను.

దినపత్రిక తిరగవేస్తుంటే ఒక వార్త నాదృష్టి నాకర్షించింది. గబాగబా చదివేను. వివరాలు అర్థం కాక పోయినా విషయం అర్థమైంది. నిరుద్యోగ భీమా పథకాన్ని ప్రవేశ పెడుతుందట ప్రభుత్వం. గుండెల్లో గూడు కట్టుకున్న భీతి అణుమాత్రం సడలింది. అంతలో స్ఫురించింది. ఆ పథకం ఏ ఐదవ ప్రణాళికలోనో గాని కార్యరూపం ధరించదని. క్షణంక్రితం లభించిన 'రిలీఫ్' ఎగిరి పోయింది.

"ఏమిటి అంత సీరియస్‌గా చదువుతున్నారు?" అని "తీసుకోండి" అంటూ కాఫీ కప్పు నందించింది కమల.


"నో థాంక్స్. నాకు త్రాగాలని లేదు."

"ఫర్వాలేదు తీసుకోండి. వేడివేడికాఫీ త్రాగితే మనస్సు ఉత్సాహాన్ని పుంజుకుంటుంది."

మొహమాటం కొద్దీ కాఫీ త్రాగేను. "నిరుద్యోగ భీమా పథకం వస్తుందిట" అన్నాను కప్పును కింద వుంచుతూ.

కమల నవ్వి వూరుకుంది. చిత్రమైన మనస్తత్వ మనిపించింది నాకు. క్షణాల తర్వాత అడిగేను. "ఉద్యోగం పోతుందంటే విచారమే లేదల్లేవుంది మీకు."

ఆమె ఈసారి చిత్రంగా నవ్వింది. "ఈ వుద్యోగం లేకుండా బ్రతకలేనా. అలాగా వస్తుంది" అంది.



## ఫోల్డింగ్ 50 షాట్ పిస్టల్

లైసెన్సు అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు, క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస ప్రయాణాలు, యాత్రలు, నాటకాలకు ప్రశస్తమైనది. ఆటోమేటిక్ 50 షాట్లు పేర్చుట గలదు. తేలికైనది. ఇందు నుండి వెలువడు నిప్పు రవ్వలు మిమ్మును కాపాడును.




ధర: 50 షాట్లు జర్మన్ మోడల్ నెం. 99 రు.15/50. వి.పి.పి. ఖర్చులు రు. 2/50. లెదర్ కేస్ రు.3/50. అదనపు షాట్లు 100కి రు. 5/-

JAPAN AGENCY (WAPT-15)
PHAPALA, ALIGARH.



## తెల్లమచ్చలకు ఉచిత వైద్యము

శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "Swetari" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. ప్రాంతిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా ఇవ్వబడును. వెంటనే వ్రాయండి.

Sri Krishna Chandra Vaidya
(A. P.) P. O. Katrisarai (Gaya)



## అధైర్య పడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX-ADVICE పొందవచ్చును. మీకు ఉన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డా. రత్నం&సన్సు, (Estd 1904)
మొజంజాహి బిల్డింగ్స్, New
(అబిడ్స్ మార్కెట్ వద్ద)
హైదరాబాద్—36 ఆం. ప్ర.



## తెల్ల వెంట్రుకలుండవు

పొగడడం మాకు ఇష్టంలేదు. కానీ "మా కేశరంజన్" ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదటి తెల్ల వెంట్రుకలు నల్లనివిగా మార్చి, ఆటు పైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధి పరుచును. లాభం పొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 10/-.

Bengal Ayurved Bhawan (56)
P.O. KatriSarai, (Gaya) India.


# చక్రనేమిక్రమం

"ఏం చేసేవారు?"

"చెద్దతనేం పెళ్ళి నిజాయితీగా పని చేసినా బ్రతక గలం . మార్కెట్‌లో కూరలమ్ముకునే ఓ ముసలమ్మకు అసిస్టెంట్‌గా వుండేదాన్ని!"

నేను గతుక్కుమన్నాను. నిజమేనా అనిపించింది. నా సందేహాన్ని ముఖ కవళిల్లోనే చదువుకున్నది కాబోలు అడిగింది. "ఏం నమ్మలేకుండా వున్నారా?"

నేను తడబడుతూ పెళ్ళి కనిపేను. "ఎవరా ముసలావిడ?"

"మా అమ్మ..........!"

నివ్వెర పోయేను. కమల ఆమాటచెప్తున్నప్పుడు ఆమె ముఖంలో ఒకవిధమైన గర్వరేఖకూడా పొడ చూపటం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

"ఎన్ని ఉద్యోగాల కోసం ప్రయత్నించినా దొరక లేదు. ఏం చేస్తాం చెప్పండి. మధ్య తరగతివాళ్లమనుకుని ఒక్క మెట్టు క్రిందికి దిగలేక ఓ మెట్టు పైకి పోలేక అక్కడే చతికిల బడతామంటే ఎన్నియుక్కట్లో రావచ్చు. గుండె దిటువు చేసుకుని దురభిమానాన్ని చంపుకుని గౌరవంగా బ్రతకు దలుచుకుంటే— కోటివిద్యలు!"

"ఎంతనిబ్బరం!"—నా మనస్సు గొణుక్కుంది.

"పార్ట్‌నర్‌షిప్ కంపెనీ ఏదన్నా ప్రారంభిద్దామని మంతనాలు చేస్తున్నారా?" అంటూ ప్రవేశించాడు రంగారావు. అతను కలిగినవాడు. పైగా ఆ కంపెనీలో ముఖ్యమైన పెళ్ళ పర్వముంది. అతను కిసుక్కున నవ్వినప్పుడు బయటపడిన కారాకిళ్లీ గారపట్టిన పళ్లంటే నాకు తగని జుగుప్స కలుగుతుంది. ముఖం ప్రక్కకు త్రిప్పుకొని 'సభ్యతగా పొందికగా, మాట్లాడటం తెలియని మనుషులు!' అనుకున్నాను.

కమల మాత్రం "డబ్బు మదం గల ఏ పెద్దమనిషన్నా పెట్టుబడి పెడ్తే మేనేజి చేస్తాం" అంది.

కత్తివాటుకు నెత్తురు చుక్క లేకుండా పాలిపోయింది రంగారావ్ ముఖం. బహు తెలివిగా మాట్లాడటం తన సొత్తనుకునే ఆయున, దెబ్బతిని వెళ్ళి పోయాడు. 'బలేఖాసి చేసింది' అని లోలో పల సంతోషించి, కమలవైపు అభినందన సూచకంగా చూసి అక్కణ్ణుంచి కదిలేను.

ఆఫీస్ టైమయింది. ఎవరో వస్తూ మరో వార్తని మోసుకొచ్చేరు. తొలగించబడే వుద్యోగుల సంఖ్య పాతిక్కి పెరిగిందంటూ ఆ సంఖ్యల గురించిన చర్చ మొదలైంది. నా పరిస్థితి అయోమయంగా వుంది. పని మీద శ్రద్ధ చూపలేక పోతున్నాను. కమల మాటలు బుర్రలో గుర గుర లాడ సాగేయి. అయితే, అంతలోనే రామాలయంలో అసువులు బాసిన యువకుడి రూపం కళ్లకు గట్టి ధైర్యం నీరు కారి పోతోంది. ఈ సమస్యకు తోడు లక్ష్మీ పతి గారికి నాతోగల ప్రత్యేకమైన పని ఏమిటా అనే ప్రశ్న ఒకటి! ఏకోణంలో నుంచి చూసినా ఆ ప్రశ్నకు సమాధానం తోచలేదు. అందుకని ఆ ఆలోచనని త్రెంచేసేను. మిగిలిందల్లా భవిష్యత్తు భద్రం కాదనే భీతి, రేపటి ఉదయం నేనే పద్మవ్యూహంలో చిక్కుకుంటానో నన్న బెంగ.

రెండుసార్లు బల్లమీద గ్రుద్ది మరీ హెచ్చరిక చేసి ఉత్తరం చేతిలో పెట్టి పోయేడు బనాను. అది బరువైన కవరు. అడ్రసును బట్టి వ్రాసింది హైదరాజని తెలుస్తూనే వుంది.

హైదరాజా నాబాల్యస్నేహితుడు. అతనిమధ్యనెక్కువగా జాబులు వ్రాయటం లేదు. అలాంటిది ఇంతపెద్ద కవరెందుకు వ్రాశాడో ననుకుంటూ తెరచాను. . ఐదుతావుల జాబు ఓపిగ్గా చదివేను. ఏమేమో వ్రాసేడు. సారాంశాన్ని నెమరుకు వేసుకున్నాను.

హైదరాజుకు మూడో పిల్లపుట్టి మూడు రోజులే అయిందట. మొదటి ఇద్దరూ మగపిల్లలు. వాళ్లలో పెద్దవాడు మహోద్యుడుకు నేపదలని, వాడు భవిష్యత్తులో 'గొప్ప రౌడీగా' తయారయ్యేటట్టున్నాడని వాపోయేడు. ఆడపిల్ల పుట్టిన మర్నాడే తనకు ఉద్యోగంలో ప్రమోషన్ రావటం అదృష్టసూచనగా భావిస్తున్నానని వ్రాసేడు. ఉద్యోగ ప్రసక్తి వ్రాసి దానిక్రిందే ఒక కథ వ్రాసేడు. ఉత్తరం సుదీర్ఘం కావటానికి అకథే కారణం.

ముఖ్యప్రాణమూర్తి అని ఓ అందమైన యువకుడు క్రొత్తగా అతని ఆఫీసులో ఉద్యోగంలో చేరేట్ట. అతను ఎమ్మే ఫస్ట్ క్లాస్‌లో ప్యాసై చాలా కాలం పెద్ద ఉద్యోగాల కోసం అనేక ప్రయత్నాలు చేసి, చివరికి అవేవీ ఫలించక నిరాశతో పిచ్చివాడుగా తిరగ సాగేడట. ఆసమయంలో ఈ వుద్యోగం లభించింది. అయితే ఇది తన హోదాకు తగనిదనే బాధతో వద్దని పట్టుపట్టేట్టు కానీ, తండ్రి బలవంతం చేయటంతో చేరక తప్పలేదు. ఇక్కడ అతను కేవలం ఒక గుమస్తా. అతని దురదృష్టవశాత్తు అతని సెక్షన్‌లో వున్న పై అధికారులంతా చదువులో అతనికన్నా ఎంతో తక్కువ వారట. ఇది ముఖ్యప్రాణమూర్తిని క్రుంగదీసింది. ఆ ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌'తో మనసును రగిలించుకుని చివరి కొకనాడు తను చేయదలుచుకున్న పని చేశాట్ట! అదే ఆత్మహత్య! ఇంతకంటే విచారకరమైన విషయం అతని భార్య నిండు చూలాలట.!

నేనటికి 'సిటిజన్‌షిప్' క్లాస్‌లో రకరకాలైన మనుష్యులు చేర్చేవారు. ఈసమస్యలన్నీ తలచుకుంటుంటే ఆమనుష్యులు గుర్తుకొస్తున్నారు. నిరుద్యోగ బాధతో ప్రాణాలు విడిచిన రామాలయంలోని యువకుడు, ఉద్యోగం దొరికీ అది తన అంతస్తుకు తగింది కాదనే తపనతో ఆత్మహత్య చేసుకున్న ముఖ్యప్రాణమూర్తి!— పరిధులు వేరయినా ఇద్దరి మరణాలకూ మూలకారణం ఒక్కటే!

భయంకరమైన రాహు వక్త్రంలో చిక్కుకునే చందమామలా నేనూ నిరుద్యోగమనే రాహువుకు చిక్కబోతున్నాను. ఇవన్నీ తలచుకునే సరికి ఒళ్ళంతా చెమట పట్టింది. గుండె ఉద్వేగంగా చలించ సాగింది. ఆందోళితమైంది మనస్సు. ఇక సీట్లో కూర్చో లేక పోయేను. పర్మిషన్ వ్రాసిచ్చి ఆఫీసు బయట పడ్డాను.

భారంగా అడుగులు వేస్తూ బస్‌స్టాప్ కొచ్చేను. ఎక్కువ మంది జనం లేక పోవటంచేత ఒక్కడినే నిల్చున్నాను...

రెండవ చేత్తో పొడుగాటి వంకీ కఱ్ఱ పుచ్చుకున్న ముసలి ప్లీడరు, షర్టు లాంటి బనీనును గొట్టాం పంట్లాంలో టక్ చేసి ఆడంబర వేషం వేసిన ఓ యువకుడు. అలంకరణ తోనే చూపరులకు అందగత్తెనని పించాలని విఫల ప్రయత్నం చేసిన ఓ నడి వయస్సు స్త్రీ, ఇంకో ఇద్దరు స్కూలు పిల్లలూ వున్నారు. ఆ నడివయస్సు స్త్రీ 'ఫెమినా' పత్రికను ముఖానికి అడ్డంపెట్టుకుని ఉండుండి ఆ యువకుడి వైపు చూపులు పోనిస్తోంది. అతను అది గమనించనట్లు సిగరెట్ పొగవదుల్తూ మధ్య మధ్య ఆమె వైపు ఓ చూపు విసురుతున్నాడు. నాకా వాతావరణంలో ఏదో విషయం 'ఎబ్బెట్టు'గా అనిపించింది. చుట్టూ చూసేను. కనుచూపు మేరలో బస్ జాడలేదు.

స్కూల్ పిల్లలిద్దరూ ఎదురెదురుగా నిలబడి పెద్ద బంతి నొకదాన్ని ఎగరేస్తున్నారు. ఉన్నట్టుండి ఆ బంతి పట్టుదప్పి ఆ స్త్రీ ముఖాన్న తగిలింది. ఆమె ఇంగ్లీష్‌లో తిట్టేంటే, ఆకుర్రాళ్లిద్దరూ నవ్వుకుంటూ చప్పట్లు కొట్టు కుంటూ ప్రక్కకు పోయేరు. ఈ లీలను గమనించి బోసినోటితో తనలో తాను నవ్వుకో సాగాడు ముసలి ప్లీడరు.

వెళ్లిపోదామనే వుద్దేశ్యంతో రెండడుగులు ముందుకు వేసేను నేను. ఇంతలో ఒకవ్యక్తి రోడ్డుకు అడ్డంపడి గబ గబా ఇవతల వైపుకు పరుగెత్తుకొచ్చేడు. నేను ఆగేను. చూపులకు అతనొక క్షయ రోగిలా వున్నాడు. ఇంటి దగ్గర అమ్మరూపం, ఆ వెంటనే థోరాకో ప్లాస్టీ ఆపరేషన్‌కు బలి అయిపోయిన వ్యక్తి గుర్తుకొచ్చి, ప్రయోగార్థం గాజుబాడీలో వుంచబడిన గులాబీ కాడ కళ్లకు గట్టింది.

మనిషిలో ఏమాత్రం నాగరికత గోచరించక శల్యావశిష్టంగా వున్న ఆవ్యక్తి ఎవరో అర్థం కాలేదు. అతను సరాసరి ఆ ముసలి ప్లీడరు ముందుకు వెళ్లి ధారాళంగా ఇంగ్లీషులో ఏదో మాట్లాడ సాగేడు. నేను ఉత్సుకతతో మరికొంచెం వెనక్కు వెళ్లేను.

క్షణాల్లో విషయం అవగతమైంది. అతనొక పట్టభద్రుడట. ఉద్యోగం చేస్తూండగా మతి చలించిన కారణాన అది వూడిందట. అప్పట్నుంచీ ఇలా కాలం గడుపుతున్నాట్ట.

కాలిలో గుచ్చుకున్న ముల్లును సూదితో కదిలించినట్లయింది. నాహృదయం జాలితో నిండింది. అతని ఇంగ్లీష్ వాక్చాతుర్యం నన్ను అమితంగా ఆకర్షించటమే గాక, ఆశ్చర్యం కలిగించింది. ప్లీడరుగారు అదోలా చూసి లేదు పొమ్మని చెయ్యి త్రిప్పేరు. అతను అక్కడున్న యువకుణ్ణి నడివయస్సు స్త్రీనీ కూడా అలాగే యాచించేడు. ఆమె హేండ్ బ్యాగ్ తీసి పదిపైసల నాణెం పడేసింది. అందుకు సంతోషించినా ఆమె ముఖంలో పొడ చూపిన అసహ్యం నన్ను బాధించింది. ఆ యువకుడు మాత్రం లేదు పొమ్మటంతో వూరుకోక 'యాచన'ని ఈసడిస్తూ నాలుగు వాక్యాలు మాట్లాడేడు. ఇంగ్లీషు భాషకు వ్యాకరణం వుందని అతనికి తెలీదేమో ననిపించింది నాకు! ఆటుపైన ఆవ్యక్తి నావైపు పరికించేడు. నేనొక పావలా కాసు తీసి ఇచ్చేను. అతను వెళ్లిపోయేడు. వెళ్తున్న అతనివైపే చూస్తుంటే నామనస్సులో ఏవేవో భావాలు రేగేయి. నిరుద్యోగ మనే రాహువుకు చిక్కి పోతున్న నా మనో యవనిక మీద మరొక క్రొత్త దృశ్యం మరొక క్రొత్త నటుడు నిలిచేరు. ఇన్ని అంకాలు, ఇన్ని రంగాలు గల నాటకంలో నేనే పాత్ర ధరించాలో అని పించింది. ఏదో వేషధారణ సందర్భంలో పైడిరాజే ననుకుంటాను, ఒక సారి అన్నాడు, "నువ్వొక ఇత్తడి పాత్ర నేనొక కంచు పాత్ర ధరిద్దాం' అని. ఆ ఛలోక్తే నిజమై ఇత్తడిపాత్ర ధరించాలేమో!— విషాదంలో కూడా ఒక చిన్న హాసం!

నడక సాగించేను.

పార్కు లోని ఓటవరు క్లాక్ నాలుగూఇరవై అయిదు నిముషాలు చూపుతోంది. లక్ష్మీపతిగారు ఐదున్నరదాకా కానిది ఇంటికి రారు. ఈ గంటా పార్కులో గడుపు దామని నిశ్చయించుకుని లోపలికి వెళ్లేను.

గేటుదాటగానే కాంటీన్‌కోసం నిర్మించబడిన షెడ్డులో ఇద్దరు 'పనిమనుషుల్లాంటి' స్త్రీలు పెద్దగా పోట్లాడుకుంటున్నారు. వాళ్లకి ప్రక్కగా ఐదుగురు పిల్లలు పాతగోనిపట్టాలు, పాతగుడ్డలు, పాడైపోయిన పెట్టె వేసుకుని కూర్చుని వున్నారు. ప్రక్కనున్న వాళ్లెవరో అంటున్నారు, "ఈ స్థలం దానబ్బ సొమ్మూకాదు, దీనమ్మ సొమ్మూకాదు. అనవసరంగా కొట్టుకు చస్తున్నారు" అని. బాగానే వుంది సరాగమనిపించి ముందుకు కదిలేను. పచ్చిగడ్డి మీద నడుంవాల్చే సరికి ప్రాణానికి కించిత్తు హాయి లభించినట్లైంది. ప్రొద్దుట అనుకున్న 'విపులాచ పృథ్వి' అన్న సూక్తి కూడా నాపట్ల వర్తించదేమో ననిపించింది—షెడ్డులో స్త్రీల పోట్లాట తలచుకునే సరికి. నిలువ నీడలేని వాళ్లల్లోనూ ఈర్ష్య, అసూయ, ద్వేషం, కోపం, ఆవేశం, కావేషం! చిత్రమైన మానవ సమాజం!—

"బఠానీ మసాలా ఇమ్మంటారా?"

పిలుపుతో ప్రక్కకు చూసేను. ఒక పెద్ద చెక్క మీద ఉడకబెట్టిన బఠానీలూ పోసుకుని వాటిపైన వేయించిన మిరపకాయలు, ప్రక్కగా నిమ్మకాయలు అందంగా అమర్చి, ఆ చెక్కని నిలపటానికొక స్టాండును పుచ్చుకుని నిలబడ్డాడతను.

"పది పైసలకివ్వు" అన్నాను.

చెక్కని స్టాండు మీద పెట్టి, కాగితంలో బఠానీలు కట్టి, నిమ్మకాయ పిండి ఇచ్చేడతను.

ఏమాత్రం సంపాదిస్తావోయ్ దీనిమీద?"

"ఆ ఎంతుంటుందండీ. రోజుకో మూడు నాలుగు రూపాయలు."

పదిపైసలు తీసుకుని వెళ్లిపోయేడతను. 'ఫర్వాలేదు, సుమారు నా జీతమంత' అనిపించింది. అవును మరి, నా సంపాదన అన్నిచందాలూ పోను నెలకు నూట పన్నెండు రూకలు. ఉద్యోగం పోయినా ఈ మాత్రపు జీవన భృతి ఏర్పరచుకోలేనా?' అనే ఆశ కలిగింది, బఠానీలు అంటూ వుంటే కమల మాటలూ గుర్తొచ్చినై. అవును. గౌరవంగా జీవించదలచుకుంటే కోటి విద్యలు! కొద్దిదూరంలో సోడా కేక వినబడింది. ఆవైపు చూసేను. 'పిల్లంతా బ్రతకటంలేదా, చస్తున్నారా?' అనిపించింది.

అయితే, అంతలోనే ఆ రాహువు నా కళ్ల ముందు ప్రత్యక్షమైనాడు. రాహుగ్రహంలో పోయిన యుక్తి కూడా, ముఖ్యప్రాణమూర్తి, ఐన్‌స్టీన్‌తో అస్థిపంజరం, పార్క్‌షెడ్‌లో పోట్లాడుకుంటున్న స్త్రీలూ అందరూ కళ్లముందు నర్తించారు. క్షణంలో సగం చేసి కూడగట్టుకున్న ధైర్యం ఎగిరిపోయి, భీతి ప్రతాపంతో నన్ను లొంగదీసుకోసాగింది. బఠానీల పొట్లం అప్రయత్నంగా జారి క్రింద పడిపోయింది. దానిని మళ్లీ తీసుకోవటానికి మనస్కరించలేదు. అలాగే కళ్లు మూసుకుని పడుకున్నాను. అలసిపోయిన మేధస్సు, శరీరము కూడా మెలకువ, నిద్రకాని అవస్థకులోనైనాయి.

పెద్దగా అరుపులూ, గలభా వినబడటంతో త్రుళ్ళిపడి లేచేను. నాకు అతిసమీపంలో ఏదో గలాటా జరుగుతోంది. లేచివెళ్లి చూసేను. నీటుగా ముస్తాబై వున్న ఓ యువకుణ్ణి చెట్టుకు కట్టేసి ప్రముఖంగా ఇద్దరు కొట్టేస్తున్నారు. తలకొక మాటగా అంటూ ఆ దృశ్యాన్ని చూసి ఆనందిస్తున్నారు కొంతమంది జనం. నా ప్రక్కనున్న వ్యక్తిని అడిగేను, "ఏం జరిగింది?"

"జేబు కొట్టేట్ట. దొరికిపోయాడు" అన్నాడతను.

నేను 'జేబుదొంగ' వైపు మరోసారి చూసేను. చదువుకున్న వాడిలా, సంస్కారిలా కనబడుతున్నాడతను. 'పరిస్థితులు మనిషి నెంత నైచ్యానికైనా దించుతాయి' అనిపించింది. గుండె మారుమూలల్లో భీతి నిక్కినిక్కి చూసింది.

టైమ్ చూసేను ఆరుగంటలు కావస్తోంది. లక్ష్మీపతి గారింటికి వెళ్లటానికి పార్కు బయటికి నడిచేను.

* * *

అప్పటివరకూ నేనా మూడంతస్తుల భవనాన్ని దాటి వెంట వెళ్తూ చూడటమేగాని, లోపలికి వెళ్లి చూసే అవసరం, అవకాశం కలగలేదు.

గేటు తీసుకుని లోపలికి ప్రవేశించగానే దారికి రెండువైపులా నిలబడి వివిధ జాతుల పూలమొక్కలు ఒకక్రమంలో స్వాగతమిచ్చేయి. ఎదురుగా విశాలమైన వసారాలో రెండు ట్యూబులైట్లు వెలుగుతూ ఆ వసారాలోని వస్తు సముదాయాన్ని ప్రకాశింపజేస్తున్నాయి. గోడలకు వేసిన రత్నావళి రంగు ఆ దీప కాంతిలో దేదీప్యమానంగా మెరుస్తోంది.

నన్ను చూసి లక్ష్మీపతిగారు సాదరంగా ఆహ్వానించేరు. ఆయన నాకొక సోఫా చూపుతూ కూర్చోమన్నారుగానీ, నాకే బెరుకనిపించి 'ఫర్వాలేదండీ' అంటూ నిలబడ్డాను.

ఆయన కూర్చున్నారు. తనకు సహజమైన చిరునవ్వు నవ్వి అన్నారు, "ఇప్పుడు నేను మీ బాస్‌ను కాను. కూర్చోండి." తప్పేమని కూర్చుండిపోయి, హాలంతా కలియజూడ సాగేను. మనస్సులో మాత్రం ఆయన ఎందుకు పిలిపించారా అన్న ఆందోళన, ఏం చెప్తారోనన్న ఆతృత పొంగుతూనే వున్నాయి.

క్షణాల తర్వాత లక్ష్మీపతిగారు చెప్పటం మొదలెట్టేరు, "జీవితంలో కొన్నికొన్ని సంఘటనలు చిత్రంగా, విచిత్రంగా జరుగుతూ వుంటై. ఆ సంఘటనలకు ఇదమిత్థమైన కారణాలు వుండకపోయినా, వాటి పరిణామాలు మాత్రం తీవ్రంగానే వుండవచ్చు. మీరు ఆఫీసులో చేరిన మొదటిరోజున—

...మ్మల్ని చూడగానే నాకొక సదభిప్రాయం కలిగింది. ఇంకా చెప్పాలంటే ఏవేవో గత స్మృతులు నన్ను చుట్టివేసినై! మీ మీద, మీ మంచితనం మీద నమ్మకంతో ఇప్పుడు మీకీ బాధ్యత అప్పజెప్తున్నాను...."

ఆయన చెప్పటం ఆపి నా ముఖంలోకి చూసేరు. నేను ఆతృతని నింపుకున్న కళ్లతో వారివైపు చూస్తూ వుండిపోయేను.

"రండి, లోపలికి పోదాం" అంటూ సోఫాలోంచి లేచేరు. నేను వారి ననుసరించేను. రెండు మూడు గదులు దాటి ఒక చిన్నగదిలోకి ప్రవేశించాం. నా ముందు నిలచిన లక్ష్మీపతిగారు ప్రక్కకు తప్పుకుని, కుడిచేత్తో "చూడండి" అన్నట్లు సైగ చేసేరు. ఎదురుగా వున్న దృశ్యం చూసేసరికి నా వొళ్లు జలదరించింది, క్షణకాలం నా మెదడు మొద్దుబారిపోయింది!

లక్ష్మీపతిగారు చెప్ప సాగేరు, "కర్మఫలం ఏ రూపాల్లో అనుభవంలోకి వస్తుందో చెప్పలేం. తెలిసో, తెలియకో ఏ జన్మలోనో చేసిన పాపం ఇలా పట్టి కుడుపుతోంది" వారి కంఠం రుద్ధమైంది.

నేను ఊపిరి బిగపట్టి నిలబడిపోయేను.

"రఘు పుట్టటమే అలా పుట్టాడు. జన్మతః కలిగిన అవిటిదనానికి చికిత్సలేదని తెలిసినా, ఆశ కొద్దీ అనేక డాక్టర్లకు చూపేను. అందరూ పెదవి విరిచిన వారే! ఇప్పుడు వాడికి పదో ఏడు. చదువులో చాకులా పదును చూపుతున్నాడు. మిమ్మల్ని పిలిచింది ఇందుకే."

నాకు విషయం అర్థమైంది. మళ్లీ ఒకసారి రఘు వైపు చూసేను. హృదయం ద్రవించింది. కాళ్లు రెండూ కేవలం రెండు తోటకూర కాడల్లా వ్రేలాడుతున్నాయి.

"రండి చెప్తాను" అంటూ దారి తీసేరాయన.

వసారాలో కొచ్చి కూర్చున్న తర్వాత చెప్పేరాయన, "ఈ ప్రారబ్ధానికి తోడు చెవుడూ వుంది. ఈ వయస్సులో నాకు గుండెల మీద కుంపటిలా తయారయ్యేడు వీడు. వాళ్లమ్మ వీణ్ణి కని కన్ను మూసింది. ఆ వెంటనే మీ ఈడున్న పెద్దవాడు [illegible] బల్లైపోయేడు. అప్పటికే వాడు ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఈ రెంటితో చిట్లిన హృదయం మా రమ రాకతో ముక్కలైంది."

లక్ష్మీపతిగారికి దుఃఖం పెల్లుబికింది. అణచిపెట్టి సోఫాలో వెనక్కువాలేరు. సరిగ్గా ఇదే సమయానికి సుమారు పాతికేళ్ల యువతి ఒకామె హాల్లో కొచ్చి నన్ను చూసి, వెంటనే తత్తరపాటుతో లోపలికి వెళ్లిపోయింది. బహుశా ఆమే రమ అయి వుండాలనుకున్నాను. బంగారు రేకులా, తమలపాకులా వున్న ఆ యువతి సౌభాగ్యాన్ని అంతలోనే హరించిన విధిలీలకు ఆశ్చర్యపోయాను.

లక్ష్మీపతిగారు తేరుకుని అడిగేరు, "రోజూ మీకు వీలైన సమయంలో వచ్చి ఒక్కగంట మావాడికి ట్యూషన్ చెప్పండి. డబ్బిస్తే టీచర్స్ దొరక్కపోరు. కాని, నాకు కావలసింది నమ్మకస్థుడు. నాకిలాంటి బిడ్డ వున్నట్లు బయటి వాళ్లకెవరికీ తెలీదు. నాబాధ మీ కర్థమైందనుకుంటాను.

మౌనంగా తల త్రిప్పేను. కన్నకొడుకు అవిటితనం లోకానికి తెలియ కూడదనుకునే చిత్రమైన మనస్తత్వం! ఏమైనా లక్ష్మీపతిగారి పరిస్థితికి నా హృదయంలో కరుణ జనించింది.

# చక్రనేమిక్రమం

ఆయన వెంటనే లేచి, "రా అమ్మా, రమా!" అంటూ పిలిచేరు. ప్రక్క గదివైపు తిరిగి. అప్పటి వరకూ ఆమె గది వాకిట్లో నిలబడినట్లు నేను గమనించలేదు. ఆమె హాల్లో కొచ్చి సిగ్గుపడుతూ నాకు నమస్కరించింది. నేను ప్రతినమస్కారం చేసేను. ఆమెకు నమస్కరిస్తుంటే, నా మనస్సులో ఏదో అవ్యక్తమైన పునీతభావం ఉద్భవించింది.

"చూడమ్మా, వీరి పేరు మూర్తిగారు. రేపట్నుంచి మన రఘుకు టీచర్."—

మరొకొన్ని నిముషాల తర్వాత వారివద్ద శలవు తీసుకుని లేచేను. లక్ష్మీపతిగారు డ్రైవర్ని పిలిచి కారులో వెళ్లమన్నారు. ప్రతి విషయానికీ మొహమాట పడటం బాగాలేదనిపించింది నాకే. అలాగే నంటూ కార్లో కూర్చున్నాను. కారు ముందుకు పోతున్న కొద్దీ రఘు రూపం నన్ను వెంటాడసాగింది. ఎక్కువసేపు ఆలోచించే అవకాశం లేకుండానే ఇల్లు జేర్చింది కారు.

ఇంటి ముందు కారాగేసరికి వింతగా పరిగెత్తుకొచ్చేరు, వెంకటేశంగారి పిల్లలు. శకుంతలంగాక, ఆయనకు తల్లిని పోలిన నలుగురు కూతుళ్ళు, తండ్రిని పోలిన ముగ్గురు కొడుకులూ వున్నారు! వాళ్లంతా కారు చుట్టూ చేరి కేరింతలు కొడుతూ, తమని ఒక్కసారి కార్లో ఎక్కించమని డ్రైవర్ని మారాం చేయసాగేరు.

నేను కారు దిగి ఇంటి వాకిట్లోకి వెళ్లగానే, చదువుతున్న పత్రికను మూసి ఒకచేత్తో పట్టుకుని, చిరునవ్వుతో ఎదురయింది జానకి. అప్పటికే ఆమె నీటుగా ముస్తాబై వుంది. జానకిని చూసేసరికి ప్రొద్దుట్నుంచీ అనుభవిస్తున్న మానసిక సంఘర్షణ మాయమైంది. ఆమెతో పాటు లోపలికి నడిచేను.

"అబ్బాయొచ్చాడే!" అని పిలిచింది అమ్మ.

"ఇప్పుడే వచ్చానమ్మా" అంటూ ఆమె గది వైపు దారితీసేను. అమ్మ వున్న గది ఇంటి వారి భాగాన్నానుకుని వుంది. నేనామె గదిలోకి వెళ్లగానే, ప్రక్క ఇంట్లో సాగుతున్న యుద్ధం తాలూకు భేరి శబ్దాలు వినిపించినై. వెంకటేశంగారి భార్య— శేషమ్మ పిల్లల వీపుల మీద మద్దెల వాయిస్తోంది. వాళ్ళు ఒకళ్లనొకళ్లు తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టూ, తమతమ ప్రజ్ఞల్ని చూపుతున్నారు. ఆవిడ పాపం, వాళ్లందర్నీ సముదాయించలేక అదుపు చేయలేక వాళ్లనీ, వాళ్లమ్మనీ, నాన్ననీ—నోటి కొచ్చిన రీతిగా వన్నెచిన్నెలుగా తిడ్తోంది.

పిల్లలంటే ఏవగింపు, కోపం, కలిగేయి. అమ్మ రోజల్లా ఇంతటి పెడబొబ్బలు భరిస్తూ, ఆ గదిలో ఎలా గడుపుతోందోననిపించింది. ముఖ్యంగా రోగి కనుక ఆమె పడకను రేపే ఆ గది నుంచీ మార్చాలని నిశ్చయించుకున్నాను.

అమ్మ ఆరోగ్యాన్ని గురించి విచారించేటంతలోనే ఆమెకు దగ్గు వచ్చింది. ఆ దగ్గు తెర క్రమంగా ఎక్కువై, చూసే వారి మనస్సు కలచేటట్లుంది. పాటిపోయి వున్న అమ్మ దేహం చూసేసరికి ప్రయోగార్థం గాజు జాడీలో వుంచబడిన గులాబీ కాడ గుర్తుకొచ్చింది.

అమ్మ దగ్గటం గమనించి మంచినీళ్లు తీసుకొచ్చింది జానకి. దగ్గు కొంచెం తగ్గింది. ఆమె మంచినీళ్లు త్రాగి, తానెంతో [illegible] కాలం ప్రతీక్ష[illegible] మాట్లాడటం మొదలెట్టింది. నాకిలాంటి విషయం బాగా మామూలైపోయింది. బహుశా ఆ కారణానో, లేక బాధ్య అధికంగా వినలేని బలహీనత వల్లనో—ఈ మధ్య ఇలాంటి విషయాల్లో కొంత అసహనం ఎక్కువైంది. 'భోజనం చేసి వస్తా' నంటూ అక్కణ్ణుంచి కదిలేను. మౌనంగా చూపుతో నన్ననుసరించింది జానకి.

గదిలో పడుకుని పత్రిక తీసేను. మంచినీళ్ల చెంబు, గ్లాసు తీసుకుని గదిలోకి వచ్చింది జానకి. ప్రొద్దుట్నుంచీ జరిగిన సంఘటనల్ని ఆమెకు చెప్పటమా వద్దా అని తటపటాయించేను. ఈ ఉద్యోగం పోవటం వంటి వార్తలు ముందుగా వాళ్లకి చెప్పి, వాళ్ల మనశ్శాంతిని పాడు చేయటమెందుకు లెమ్మనిపించి, చెప్పకపోవటమే ఉత్తమమనిపించింది.

దీపం తగ్గించి వచ్చి మంచం మీద కూర్చుంది జానకి. కొద్దిక్షణాలు మౌనంగా గడిచినై.

ఆ తర్వాత ఆమే అడిగింది, "ఏం అలా వున్నారు?"

"అబ్బే. ఏంలేదు!" —నా జవాబు.

"ప్రొద్దుట మీరు వెళ్లిన తర్వాత శకుంతల మళ్లీ వచ్చింది."

నేను లేచి కూర్చుని జానకి కళ్లల్లోకి ఉత్సుకతతో చూసేను.

"పాపం, దానికి నా దగ్గర అమితమైన చనువు. అందుకని మనసులో మాట చెప్పుకుని కంట తడి పెట్టుకుంది."

"ఏమని?'

"ఏమనేముంది. మీకు చెప్పి ఈ సంబంధం కాకుండా చూడమని.'

"ఇది మరీ బాగుంది. విడమంటే పాముకు కోపం, మింగమంటే కప్పకు కోపం అన్నట్లుంది. అయినా ఇప్పుడేం మునిగిపోయిందని—ఆ పిల్ల అంత గాభరా పడటానికి. వాళ్లు పిల్ల నచ్చిందన్నారేగానీ, పిల్లిస్తామన్న వెయ్యి నూటపదహార్లు సరిపోతాయని చెప్పలేదుగా? '

"అవుననుకోండి" అని సాగదీసింది జానకి.

నేను మరేమీ మాట్లాడలేదు. నా రెండు కొచ్చిందీ మధ్యవర్తిత్వపు బాధ అనిపించింది. రేపు వాళ్లూ వీళ్లూకూడా నన్నాడి పోసుకుంటారేమో నన్న బెంగా కలిగింది. శకుంతలను గురించీ, ఆ పిల్ల కంటున్న బంగారు కలల్ని గురించీ, ప్రస్తుతం ఆమె ఆవేదన గురించీ ఆలోచిస్తుంటే బస్సులో తారసపడిన పల్లెపడుచు, లక్ష్మీపతిగారి రమా కళ్లెదుట నిల్చేరు. ఆశలకు అనుభవాలకూ సంబంధ మేముంది కనుక!

నా ఆలోచనను భంగం చేస్తూ విలాసంగా నా మీదికి వంగింది జానకి. గుండెల్లో మండుతున్న ఆవేదనన్నిటినీ తాత్కాలికంగా ప్రక్కకునెట్టి, జానకిని నా బాహువుల్లోకి తీసుకున్నాను.

ఆమె కాశీరత్నం తీగెలా నన్ను పెనవేసుకుంటూ అందంగా హాయిగా నవ్వింది. జానకి అందగత్తె ననిపించింది నాకు. అంతకు క్రితం క్షణం వరకూ నా మనస్సును పట్టి పీడిస్తున్న కోటికోటి సందేహాలూ—సమస్యలూ, భీతి—బెంగా, అన్నీ అక్షణంలో నన్ను వదిలేసినై!

జానకి సిగ్గుపడుతూ అంది, "మీకో [illegible] వార్త చెప్పాలి.

ఉత్కంఠతో, ఆమె చేతిని నొక్కుతూ అడిగేను, "ఏమిటది?'

ఆమె చెప్పింది. క్రీగంటి చూపులో ఒకింత లజ్జను, ఒకింత గర్వాన్నీ రంగరించి, పెదవులపై చిరునవ్వుల రత్నాల్ని కలబోసి, నా పెదవులపై పెదవులుంచి చెప్పే చెప్పినట్లు చెప్పింది.

ఆ ఆనంద పారవశ్యంలో నే నామెను ఉక్కిరి బిక్కిరి చేసేను. జానకి ఆలుచిప్పలోని స్వాతి చినుకులా నాలోకి ఇమిడిపోయింది.

మరుక్షణంలోనే, నాలోని భీతిభూతం తన రూపాన్ని పెంచి విజృంభించింది. అప్రయత్నంగా జానకిని నా చేతుల్లోంచి వదిలేశాను. ఒళ్లంతా చిరుచెమట పట్టింది. నా మనోఫలకం మీద— ఎండిన గానుగ పుల్లలా తయారైన శేషమ్మ రూపం, ఆమె పిల్లలు, వాళ్ల అల్లరి, బీభత్సం, పైడిరాజు పెద్ద పిల్లవాడి కాళ్ళీ చేష్టలు, ..రఘు రూపం....

అవును. రఘు రూపం ప్రత్యక్షమై ఒళ్ళు జలదరించింది. పుట్టబోయే శిశువు.. వీడి వంటిదే అయితే..?—

గుండెల్లోని భీతి అణువణువుకూ ప్రాకి దేహాన్ని వణికించింది. మనస్సు ఉద్విగ్నమైంది. దయానిధి గుర్తు కొచ్చేడు—నాకు పుట్టబోయే బిడ్డ అంతటి అదృష్టవంతుడు కాబోడు గానీ, రఘు వంటి శాప గ్రస్తుడు, దురదృష్టవంతుడూ కావటానికి అవకాశం లేకపోలేదు.

అమ్మ వ్యాధి, డాక్టర్ రామారావ్‌గారి మాటలు, థోరాకోప్లాస్టీకి బలియైపోయిన యువకుడు, గాజు జాడీలో వుంచబడిన గులాబీ కాడ..!.. ఓహ్.. భగవాన్..వద్దు..వద్దు..

జానకి కంగారుగా నన్ను కుదుపుతూ ప్రశ్నిస్తోంది, "ఏటైటండీ! ఏమైందండి?"

అవును, ఏమైంది?—

ఏమైనదో ఆమె కెలా చెప్పను? హృదయంలో మహాలయాలలా గూడుకట్టుకుని నన్ను చిత్రహింస పాల్జేస్తున్న ఈ వేదనని ఈ భీతిని ఆమె కేమని చెప్పను? ఎలా విశ్వసించగలను?—

* * *

అనంతమైన కాలప్రవాహంలో క్షణాలు నిముషాలై, నిముషాలు గంటలై, గంటలు రోజులై, రోజులు నెలలు, సంవత్సరాలై—నాలుగేళ్లు జారిపోయేయి.

రోజులాగే తెల్లవారింది.

రోజులాగే ఐదింటికల్లా మెలకువ వచ్చింది. రోజులాగే సందేహం కలిగింది. ఈ రోజెలా గడుస్తుందోనని.

ఉదయం ఆఫీసుకు బయల్దేరి బస్‌స్టాప్ చేరుకున్నాను. బస్ వస్తున్న జాడలేదు. సన్నటి ఈల, ఈలతో పాటు స్కూటర్ ఆగిన చప్పుడూ, ఈ రెంటితోపాటు నా భుజం మీద పడిన దెబ్బతో ఉలిక్కిపడి ప్రక్కకు చూసేను.

దయానిధి! అతన్ని వూరులో చూసి ఆశ్చర్యపోలేదు కాని, అతని భుజాన్ని పట్టుకుని స్కూటర్ వెనక సీట్లో కూర్చున్న యువతిని ఆశ్చర్యపోయాను. ఆమె నవనాగరికంగా వుంది. ఆమెను నేనెక్కడో చూసినట్టనిపించింది.

"ఏమిటోయ్ మూర్తీ, ఈ వూళ్లో ఏం చేస్తున్నావ్?" దయానిధి అడిగేడు.

ఆకాశం వైపు చూపులు సారించి, ఆమెను గురించి ఆలోచిస్తూ—సావధానంగా వివరాలు చెప్పేను. క్షణాల తర్వాత అతనే "హైదిటై. మీట్ మిసెస్ రాజేశ్వరి దయానిధి. ఈమెని నేను లవ్ చేసి మేరేజ్ చేసుకున్నాను." అంటూ ఆమెను పరిచయం చేసేడు.

"గ్లాడ్ టూ సీయూ" అని విలాసంగా నమస్కరించిందామె.

నేను ప్రతినమస్కారం చేసేను. దయానిధి నన్నామెకు పరిచయం చేయగానే, ఆమె పొంగివస్తున్న నవ్వును పెదవులపై బిగపట్టి, "మీరు నాకు తెలుసు. ఒక సందర్భంలో పరిచయమైనారు' అంది.

ఆమె ఎవరో, ఎక్కడ చూసేనో హఠాత్తుగా గుర్తు కొచ్చింది నాకు. సిగ్గుతో తలవంచుకున్నాను నేను.

"ఆరోజు మీరు బస్ దిగి వెళ్లిన తర్వాత అసలు దొంగ దొరికేడండి, మిమ్మల్ని అంతమందిలో అలా అవమానించినందుకు చాలా బాధపడ్డాను." అన్నదామె నొచ్చుకుంటూ.

నే నామెలో వచ్చిన మార్పుకు అబ్బురపోయేను. అదంతా దయానిధి ప్రభావమై వుంటుందనిపించింది.

ఇంతలో బస్ వచ్చింది. నేను వారిద్దరి దగ్గరా సెలవు తీసుకున్నాను. దయానిధి తన అడ్రస్ ఇచ్చి తప్పకుండా 'సతీసమేతంగా రమ్మని' ఆహ్వానించేడు.

బస్ వెళ్లిపోతోంది.

ఈ నాలుగు సంవత్సరాల్లోనూ జరిగిన సంఘటనలు ఒకదాని వెంట వేరొకటి నాకళ్ల ముందు ఎత్తించిన్నై.

అమ్మకు భయంకరమైన క్షయవ్యాధి నయమౌతుందని నేనే నాడూ అనుకోలేదు. కాని, ఆమె జబ్బు నుంచి కోలుకుంది. ఆమెకు బాగా స్వస్థత కూడా చేకూరింది.

కమల వంటి మరో పదిహేను మంది అభాగ్యులతో పాటు నాకూ వుద్యోగం వూడింది. అయితే ఆమెకు సెంట్రల్ సెక్రటేరియట్‌లో స్టెనోగా వుద్యోగం లభించింది. ఆమె ఢిల్లీ వెళ్లిపోయింది. నే నూహించుకుని తపించిపోయిన నిరుద్యోగ రాహువు నన్ను తన వక్త్రాల్లో చిక్కించుకుని పెనుబాధలకు గురి చేయలేదు. నన్నా సమయంలో పైడిరాజు ఆదుకున్నాడు. వాళ్ల కంపెనీలో ఉద్యోగ మిప్పించేడు.

జానకి దబ్బపండు వంటి పొంగిపిల్లవాణ్ణి ప్రసవించింది.రవి మా కళ్ల వెలుగైనాడు.వాడి ముద్దుముచ్చట్లు మురిపాలు చూస్తుంటే కాలగమనమే తెలియటం లేదు మాకు.

శకుంతల పెళ్లి ఓ ఆదర్శయువకుడు—ఇంజనీర్‌తో జరిగింది. అతనామె సౌందర్యానికి ముగ్ధుడై, కట్నం లేకుండా వివాహమాడేడు. వాళ్ల ఆ పిల్ల భవిష్యత్తు సుఖమయం కాదేమోనని భయపడ్డ నా మనస్సు ఈ సంఘటనకి చాలా ఆనందించింది.

కట్నం చాలదని శకుంతలని వివాహమాడ నంగీకరించని ప్రసాద్ మరో గొప్పింటి పిల్లని వివాహమాడి విదేశాలకు వెళ్లాడు!

లక్ష్మీపతిగారు, రమా వేణా వూరి నుంచి వచ్చేటప్పుడు ఎంతో కృతజ్ఞత చూపి, ఆదరణతో మా కుటుంబ సభ్యు లందరికీ నూతన వస్త్రాలిచ్చి వీడ్కోలిచ్చేరు.

గతంలో నే నూహించినట్లు ఏ సంఘటనా జరక్కపోగా, ఒకవిధంగా అన్ని సంభవాలు నా కనుకూలంగానే పరిణమిస్తున్నా, నా అంతరాంతరంలో దాగిన భీతిభూతం మాత్రం—'నే నున్నాన' ని నన్నప్పటికీ హెచ్చరిస్తూనే వుంది.

ఈ రోజుకీ నా గుండెల్లో గూడుకట్టుకుని వున్న సందేహాలే అందుకు తార్కాణం. అమ్మకు ఏ క్షణంలో ఆ భయంకర వ్యాధి తిరుగబెట్టుతుందో?— క్షణక్షణానికీ మారిపోయే నిత్య ప్రపంచ ప్రగతి యజమానుల వద్ద పని చేస్తున్న నేను ఏ క్షణంలో నిరుద్యోగి నౌతానో? రేపు మావూళ్లో మళ్లీ ప్రసవించబోయే జానకి అందమైన ఆడపిల్లను కని నా కోరిక తీరుస్తుందో లేదో?—

రేపటి ఉదయానికి నేనే పరిస్థితుల పద్మవ్యూహంలో చిక్కుకుంటానో నన్న సందేహం చక్రనేమిక్రమాన భ్రమిస్తూనే వుంది నా జీవితంలో! ●

